# కంటే... నేనే కంటాను

**రత్నాకరం రుక్మిణీదేవి**

ఉదయం ఎనిమిది గంటలైంది. శివానందం హాలులో సోఫాలో కూర్చుని పేపరు తిరగేస్తున్నాడు. ఆ రోజు శివరాత్రి కావటాన, దాక్షాయణి చన్నీళ్లతో స్నానమాచరించి, శివపూజ పూర్తి చేసుకుని హారతితో హాలులో కూర్చున్న శివానందం దగ్గర కొచ్చింది. కానీ శివానందం పేపరు న్యూసులో ఐక్యమైపోయాడు.

"ఏమండోయ్ శ్రీవారూ, కాస్త ఈ లోకంలోకి రండి. వచ్చి హారతి కళ్లకద్దుకోండి, ఏంటో, ఈ రోజు శివరాత్రి. ప్రతి ఇంట్లోనూ, ఇంట్లో ఉండే నలుగురూ కలిసి ఏ గుడికో, గోపురానికో వెళ్లి దేవుణ్ని దర్శించుకుని, కాస్తో కూస్తో పుణ్యం మూట కట్టుకుందామని చూస్తారు. మన ఇంట్లోనూ..."

"సరె సరే. నీ సోది ఆపి టిఫిను పెట్టు. కడుపులో ఎలకలు పరుగెడుతున్నాయి" హారతిని కళ్ల కద్దుకుంటూ అన్నాడు శివానందం.

"చిత్తం శివుని మీద భక్తి చెప్పుల మీద అని వూరికే అన్నారా పెద్దలు? హారతైనా కాస్త మనసు పెట్టి అద్దుకోండి. భగవంతుని పై భక్తి మనసులో వుండాలి. హారతి పదిసార్లు కళ్లకి అద్దుకున్నంత మాత్రాన రాదు. సరె గానీ నువ్వు టిఫిను పెడతావా లేక హోటల్‌కి బయలుదేరనా?"

"పెడతాను బాబు పెడతా. పెట్టక చస్తానా? మనకి కడుపే కైలాసం ఇల్లే వైకుంఠం కద్దా!" భర్త మాటలకు సణుక్కుంటూ లేచి కిచెన్‌లోకి వెళ్లి ఇడ్లీ ప్లేటు తెచ్చి భర్త ముందు పెట్టి ఎదురుగా కూర్చుంది, దాక్షాయణి.


ఇడ్లీ ప్లేటు చూసిన శివానందం మొహం అదోలా పెట్టి, "ఏంటి! దక్షూ పండుగ నాడు కూడా ఇడ్లీయేనా? సరె.. సరె అలా చూడకు. పూజలు, ఉపవాసాలు అంటున్నావు గదా ఈ రోజుకి ఎలాగో సర్దుకుంటానులే. రేపు మాత్రం నాకు పెసరట్టు, ఉప్మా చేసి పెట్టాల్సిందే. సరేనా?" బుంగమూతి పెట్టి చిన్న పిల్లాడిలా అడిగాడు శివానందం.

భర్త బుంగమూతి చూసి దాక్షాయణి ఫక్కున నవ్వేసింది. శివానందం కూడా శ్రుతి కలిపాడు. ఇద్దరూ సరదాగా నవ్వుకున్నారు. అక్కడి వాతావరణం కూడా ప్రశాంతంగా మారిపోయింది. దాక్షాయణికి ధైర్యం ధన్‌మని వచ్చేసింది. తాను చెప్పబోయే విషయానికి నాందిగా ఒక జోకు విసిరింది, భర్త మీదికి. "బ్రతికించారు పోండి. పండుగ నాడు కూడా ఇడ్లీయేనా? అన్నారు కాబట్టి సరిపోయింది. అదే పండుగ నాడు కూడ పాత పెళ్లామేనా అంటే... నే చచ్చేదాన్ని!"

"అంత అదృష్టమా తల్లీ, నాకు? సంవత్సరం కిందట నీ మెళ్లో తాళి కట్టినప్పుడే ఆ అదృష్టం నా చేయి జారిపోయింది" క్రీగంట దాక్షాయణిని చూస్తూ అన్నాడు శివానందం.

భర్త మంచి మూడ్‌లోనే ఉన్నాడనుకున్న దాక్షాయణి, గబుక్కున లేచి భర్త పక్కనే కూర్చుని, భుజంపై చేయి వేసి గారాలు పోతూ, "ఏమండీ.. ఈ రోజు నేను మీకొక విషయం చెబుదామనుకుంటున్నాను, దానికి మీరు కాదు, లేదు అనకూడదు, సరేనా?" అన్నది.

"నువ్వు చెప్పేదేదో తరవాత చెబుదువు గాని. ఇందాకటి నుండి నీకొక ముఖ్యమైన విషయం చెబుదామనుకుంటున్నాను. ఇదుగో ఈ టిఫిను మూలంగా ఆలస్యమైపోయింది. ముందు నే చెప్పేది విను వింటే, నువ్వు చాలా సంతోషపడతావు కానీ, నే చెప్పినట్లే వినాలి. కాదూ... కూడదూ అనకూడదు. సరేనా?" అన్నాడు శివానందం.



"అహఁ ముందు నేనే చెప్తాను."

"కాదు.. కాదు నేనే చెప్తాను ముందు."

"కాదండీ.. నేనే చెప్తాను. లేడీస్ ఫస్ట్ అన్నారు కదా!" బుంగమూతి పెట్టింది దాక్షాయణి.

"సరె చెప్పు" ఫస్ట్ ఛాన్స్ దాక్షాయణికే ఇచ్చాడు శివానందం.

అదే అదనుగా భర్తకి ఇంకాస్త దగ్గరగా జరుగుతూ, అతని చేతిని తన చేతిలోకి తీసుకుని, వేళ్లతో ఆడుకుంటూ, "ఏమండీ మనం అనుకున్న సంవత్సరం అయిపోయింది కదా. ఈ రోజు డాక్టరు గారి దగ్గరకు వెళ్లి వద్దామా?"

"సంవత్సరం ఏంటి? డాక్టర్ ఏమిటి? అసలు నువ్వు మాట్లాడేది ఏంటి దక్షూ?" అమాయకంగా అడిగాడు శివానందం.

"అదేనండి... మన మొదటిరోజు 'దక్షూ, మనకిప్పుడే పిల్లలు వద్దు. ఒక ఏడాది హాయిగా జీవితాన్ని జాలీగా గడుపుదాం. సంవత్సరం దాటిన తరువాత పిల్లల గురించి అప్పుడాలోచిద్దాం అన్నారు కదా. నేనేమో గంగిరెద్దులా తలాడించాను. ఆ గడువు అయిపోయినా ఆ విషయం గురించి మీరు మాట్లాడటమే లేదు. అందుకే నేను గుర్తు చేస్తున్నాను. ఈ రోజు డాక్టర్ పరమేశ్వరి గారి వద్ద కెళ్లి ఆమె సలహా ప్రకారం మందులు ఆపేద్దాం, అలా చేశామనుకోండి, వచ్చే శివరాత్రికల్లా ఒక చిన్ని శివయ్యో, ఒక బుల్లి పార్వతో పుట్టుకొస్తారు. పిల్లలు లేరని ఇప్పటికే ఇరుగుపొరుగు చెవులు కొరుక్కుంటున్నారు. నాకు కూడా పిల్లలు కావాలని ఆశగా ఉంది. కాదు.. చూద్దాం అనకుండా నేను చెప్పినట్లు వినాల్సిందే!" చటుక్కున లేచి చిటుక్కున వేలు చూపిస్తూ, మరీ చెప్పింది దాక్షాయణి.

భార్య మాటలు విన్న శివానందం ఆశ్చర్యంగా మొహం పెట్టి, నోరు తెరిచాడు.

భర్త మొహం చూసిన దాక్షాయణికి ఆశ్చర్యపోయింది. క్షణంలో తేరుకుని భర్తని రెండు చేతుల్తో కుదిపేస్తూ, "ఏమండీ.. ఏంటి అలా బిగుసుకు పోయారు! మొహం మీద కాసిని నీళ్లు చల్లనా?" అంది.

"వద్దు వద్దు, నేను బాగానే ఉన్నాను.

దేవుడు మహాచిత్రమైనవాడు. లేకుంటే నే చెప్పాలనుకున్న విషయమే నువ్వు చెప్పడం ఏమిటి? ఇద్దరూ ఒకే ఆలోచనలో ఉన్నాం కాబట్టి నువ్వు చెప్పిన దానికి ఓ.కె." అన్నాడు శివానందం.

భర్త నోటి నుండి ఓ.కె. అన్నమాట వినగానే దాక్షాయణి ఎగిరి గంతేసింది. ఆ సంతోషంలో ఆమె ఏం చేస్తుందో ఆమెకే తెలియని పరిస్థితిలో, శివానందం రెండు చేతులూ తీసుకుని ఆ చేతుల్లో మొహం దాచుకుంది.

ఆ వింత చర్యతో పిల్లలు కావాలనే ఆమె మనస్సులో ఉన్న బలమైన కోర్కెను తెలుసుకున్నాడు శివానందం. "దక్షూ, నువ్వు ఆవేశపడకు. నీకే కాదు, నాక్కూడా పిల్లలు కావాలి. వాళ్లతో ఆడుకోవాలనిపిస్తున్నది. కానీ..."

"ఊ.. కానీ... చెప్పండి."

"అదే నువ్వు నెల తప్పడం. వాంతులు చేసుకోవడం, నీరసించి పోవడం, ప్రసవవేదన పడటం. అబ్బబ్బా... అవన్నీ చూసి నేను భరించలేను!"

"బాగుందండీ మీ వరస! ఏ కష్టమూ లేకుండా ఇష్టమైవాళ్లు ఎలా పుట్టుకొస్తారు? శ్రీరామునికి జన్మ ఇచ్చేందుకు కౌసల్యాదశరథులు ఎన్ని యాగాలు చేశారు, ఎన్ని పూజలు చేశారు! అలాగే దేవకీవసుదేవులు ఎన్ని కష్టనష్టాలు అనుభవించి చిన్నికృష్ణుని పుత్రుడుగా పొందారు! కారణజన్ములే పిల్లల కోసం అన్ని పాట్లు పడితే... దేనికీ పనికి రాని మామూలు మానవులం, ఏ చిన్న కష్టం లేకుండా ఎగిరివచ్చి ఒళ్లో వాలతారా పిల్లలు? మీరింకేమీ ఆలోచించవద్దు. లేవండి. లేచి రెడీ అవండి. డాక్టరుగారి వద్దకు వెళ్లి వద్దాం" భర్త చేయి పట్టుకుని లేవదీస్తూ అన్నది దాక్షాయణి.

"దక్షూ! ఒక్క నిముషం ఆగు నువ్వు ఎటువంటి కష్టమూ పడకుండా నీ వొళ్లోకి సులువుగా బిడ్డ వచ్చే మార్గం ఒకటి వుంది చెప్తాను, ఇటు కూర్చో."

"ఏంటీ! ఏ కష్టమూ లేకుండా బిడ్డా? అంటే ఎవరి బిడ్డనైనా కిడ్నాప్ చేసి తీసుకు వచ్చి నా వొళ్లో పడుకో పెడతారా?టట అనుమానంగా అడిగింది దాక్షాయణి.

"ఛ.. ఛ! అలాంటి పనులు చేసే దొంగ మొహంలా కనిపిస్తున్నానా నేను?"

"మరి ఏం చేస్తారు? మనకి బిడ్డలు పుట్టరేమోననుకుని ఏ అనాథశరణాలయం నుండో తెచ్చి నా కోరిక తీరుస్తారా?"


"ఛీ.. ఛీ.. అలా అనకు దక్షూ!"

"మరి మీ ఆలోచన ఏమిటో చెప్పండి!" భర్త మొహంలోకి పరీక్షగా చూస్తూ అన్నది దాక్షాయణి.

"దక్షూ, నువ్వు ఆవేశపడొద్దు. కోపం తెచ్చుకోవద్దు. మన మంచి కోసమే చెప్తున్నాను. ఇదుగో, ఈ పేపరులోని ప్రకటన చదువు" అంటూ, ఆ రోజు వచ్చిన న్యూస్ పేపర్ దాక్షాయణి చేతిలో పెట్టాడు శివానందం.

"కిరాయి గర్భాశయాలకు గిరాకీ" పెద్ద అక్షరాలతో వున్న ప్రకటన చూసి ఆ తరువాత, చిన్న అక్షరాలతో వున్న మేటరంతా చదివి శివానందం వంక అనుమానంగా చూస్తూ, "ఇంతకీ మీరు చెప్పే విషయానికీ, ఈ ప్రకటనలో ఉన్న మేటరుకీ సంబంధం ఏమిటి?" గట్టిగా అడిగింది.

"అదే దక్షూ, మనకి కష్టంలేకుండా డబ్బిస్తే ఎవరో ఒకామె తొమ్మిది నెలలు బిడ్డను మోసి కని మనకిచ్చేస్తుంది కదా అని."



"అంటే ఆమె ఎవరో కని ఇస్తే నేను ఆ బిడ్డను పెంచాలి, అప్పుడు ఆయాను అవుతాను కానీ... అమ్మను కాను కదండి. ఐవిఎఫ్ పద్ధతిలో బిడ్డను కనటానికి నాకు ఆరోగ్యపరమైన ఇబ్బందులు లేవు. పిల్లల్ని కనటానికి అనిష్టం అంత కంటే లేదు. మరి మనకెందుకీ పద్ధతి?"

"నీకు లేకపోవచ్చు నాకు వుంది అభ్యంతరం. ఎందుకంటే మీ ఆడవాళ్లందరూ పిల్లలు పిల్లలు అంటూ పిల్లల్ని కని నీరసించిపోయి, ఒక సరదా ఉండదు, చట్టుబండలూ వుండదు. నా ఊహాప్రపంచంలో జీవితమంటే ఎలా ఉండాలో తెలుసా? అప్పుడే వికసించిన పువ్వులా నవనవలాడుతూ కళకళలాడుతూ అలరిస్తూ ఉండాలి గానీ, చీడ పట్టిన చెట్టులా, చూసేవారికి అసహ్యం కలిగేలా ఉండకూడదు. శారీరకంగా నీలో ఏ మార్పులూ, చేర్పులూ ఉండకూడదనీ, ఏ పరిస్థితుల్లోనూ మన మధ్య ఎడబాటు ఉండకూడదనీ, ఎప్పుడూ నవదంపతుల్లా నవ్వుతూ, తుళ్లుతూ గడపాలనేదే నా ఆశ. అందుకే నే పడే ఈ తాపత్రయం! నువ్వు చెప్పినట్లు ఎవరి బిడ్డో కాదు, మన బిడ్డే అవుతుంది. మనకే చెందుతుంది. దాన్నే ఐ.వి.ఎఫ్ అంటారు. అంటే ఐవిఎఫ్ పద్ధతిలో తండ్రి నుండి శుక్రకణాన్ని, తల్లి నుంచి అండాన్ని తీసుకుని టెస్ట్ ట్యూబులో ఫలదీకరణ చేస్తారు. ఫలదీకరణ చెందిన అండాన్ని అద్దెకు ఇచ్చిన గర్భాశయంలో ప్రవేశపెడతారు. ఇలా చేయడం వలన జన్యుపరంగా పిల్లలకి అసలు తల్లిదండ్రుల జీన్సే వస్తాయి. ఇలా బిడ్డని కనిచ్చే ఆమెను 'సరొగేట్ మదర్' అని అంటారు. అప్పుడు నువ్వు మానసికంగా గానీ, లేక శారీరకంగా గానీ కష్టపడక్కరలేకుండా మనం పిల్లలకి తల్లిదండ్రులం కావచ్చు. నువ్వు దీనికి ఒప్పుకుంటే ఇప్పుడే హాస్పిటల్‌కి బయలుదేరుదాం. ఏమంటావ్?" ఆశతో దాక్షాయణి మొహంలోకి చూస్తూ అన్నాడు శివానందం.

భర్త మాటలకి అయోమయస్థితిలో ఒక్క క్షణం ఆలోచించిన దాక్షాయణి, శివానందం వైపు అదోలా చూస్తూ, "ఏమండీ, పిల్లలంటే మీరు ఏ కోడి పిల్లలో, ఏ కుక్క పిల్లలో అనుకుంటున్నట్లున్నారు! అసలు మన బిడ్డలు వేరే గర్భంలో పెరగడం ఏమిటి? అవకాశం లేనివారు ఎలాగో సరిపెట్టుకుంటారు గానీ మనకేం కర్మ?"

"పురాణకాలం నాటి సంఘటనలు మనకెన్నో గుణపాఠాలు నేర్పుతాయి. ఉత్తానపాదుడికి సురుచీ, సునీతీ ఇద్దరూ భార్యలే. అలాగే సురుచి కుమారుడు ఉత్తముడు, సునీతి కుమారుడైన ధ్రువు,డూ ఇద్దరూ ఆయనకు కుమారులే. కానీ తన కడుపున పుట్టలేదని ధ్రువుణ్ని తండ్రి తొడపై కూర్చోనీయక నెట్టేసి, ఆయన తొడపై తన కుమారుడైన ఉత్తముడే ఎల్లప్పుడూ కూర్చోవాలని ఆశించింది, కోరుకుంది సురుచి. అది పురాణకాలమే కావచ్చు. అప్పటికీ, ఇప్పటికీ ఎన్నో మార్పులూ. చేర్పులూ కలగవచ్చు. ఆచారవ్యవహారాలు మారిపోవచ్చు. సైన్సు పరిజ్ఞానం పెచ్చుపెరిగి ఎన్నో సులువైన మార్గాలు కనుగొనవచ్చు. కానీ... అమ్మతనం, మాతృహృదయం మాత్రం చెక్కు చెదరకుండా అలాగే ఉన్నాయి. జన్యుపరంగా ఫలదీకరణ మనది అయినా, ఆ పిండాన్ని తొమ్మిది నెలలు మరొకామె మోసి కని మనకిస్తే, ఆ బిడ్డని మనం ప్రేమగా పెంచుకోవడం నాకు కంపరంగా ఉంటుంది. వాడు వచ్చి మీ ఒళ్లో కూర్చోవడం. మీ పక్కనే పడుకోవడం. మీ చేత ప్రేమగా

# కొత్తకోణంలో తిక్కన కవిత

శైవ-వైష్ణవ, మతాల మధ్య సామరస్యాన్ని నెలకొల్పడం కోసం తిక్కన హరిహరాద్వైతాన్ని ఎన్నుకున్నాడు. మహాభారతంలో దాన్ని ప్రతిపాదించాడు. తిక్కన గొప్ప రాజనీతిజ్ఞుడు కూడా. సామాజికసమరసత కోసం అతడు తన రచనాశక్తిని వినియోగించాడు. ఆ రచనలోనూ కొత్త పుంతలు తొక్కాడు. శ్రవ్యకావ్యంలో దృశ్యకావ్యమర్యాదలనూ జొప్పించిన ఉభయ కావ్యప్రౌఢిమ తిక్కనది. తన కాలం నాటికి ప్రాచుర్యంలో వున్న నాట్యకళను కవిత్వంలో ప్రవేశపెట్టి శిల్పపరంగా సఫలత సాధించాడు. ఆ శిల్పరీతులను చర్చించి వివరించే చక్కని పరిశోనాత్మకగ్రంథం 'తిక్కన కవిత—నాట్యశాస్త్ర మర్యాదలు.' విరాటోద్యోగపర్వాలను తీసుకుని నందవరం మృదుల, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఎం.ఫిల్. కోసం తిక్కన కవితలోని నాట్యశాస్త్రమర్యాదలను చర్చిస్తూ ఒక సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఇందులో మూడు అధ్యాయాలున్నాయి. మొదటిది 'తిక్కన కవితా లక్షణాలు—నాటకీయత.' తిక్కన కవితాలక్షణాలైన నానారసాభ్యుదయోల్లాసత్వం, మహాకవిత్వదీక్షావిధి, ప్రబంధమండలి స్వభావం వంటి వాటిని ఈ అధ్యాయం చర్చిస్తుంది. రెండవ అధ్యాయం 'తిక్కన కవితలో నాట్యశాస్త్రమర్యాదల చారిత్రక, సాహిత్య పరిణామగతుల ప్రభావం.' తిక్కన స్వీయరచన, తిక్కన స్వీకృతరచన, సమకాలీనుల రచనలు, మార్కండేయ పురాణం, రంగనాథ రామాయణం, బసవపురాణం, నృత్తరత్నావళి, సంగీతరత్నాకరం, కావ్యశాసనాలు, దానశాసనాల వంటి అంశాలను ఇది స్పృశిస్తుంది. ఇక మూడవ అధ్యాయం 'తిక్కన పదప్రయోగాలు, నాట్యశాస్త్రమర్యాదలు'. అభినయాంశాలు, ఆంగికాభినయం, పారిభాషిక పదప్రయోగం, అచ్చతెలుగు పదప్రయోగం, వాచికాభినయం, ఆహార్యాభినయం, సుధేష్ణ పాత్ర ఆహార్యం, బృహన్నల ఆహార్యం, సాత్త్వికాభినయం, ఆంగికరేఖ, ఉల్లాసం, హాసభావసందర్భం వంటి అంశాల వివరణ ఇందులో కనిపిస్తుంది. తిక్కన భారతంపై అలంకారశాస్త్రాల ప్రభావాన్ని ఈ సిద్ధాంతవ్యాసం క్లుప్తంగానే అయినా, ప్రామాణికంగా చర్చిస్తుంది. "తెలుగు సాహిత్యంలో ఇంత విస్తృతంగా నాట్యశాస్త్రమర్యాదలను ప్రవేశపెట్టి రచించిన కవి తిక్కన తప్ప మరొకరు కనిపించరు" అన్నది మృదుల గారి ముక్తాయింపు వ్యాఖ్య. ఇలా తిక్కన రచనలోని కొత్త కోణాన్ని చూపుతారు మృదుల. ఈ పరిశోధనవ్యాసంలోని భాష కూడా సరళంగానూ, అందంగానూ ఉంది. తిక్కన కవితాలక్షణాలను తెలుసుకోదలచినవారికి ఉపకరించే ప్రామాణికమైన రచన ఇది.

**శ్రుతకీర్తి**



**తిక్కన కవిత**
**నాట్యశాస్త్రమర్యాదలు**
**రచన:**
**నందవరం మృదుల,**
**వెల: రూ.60/-.**
**పుటలు: 108.**
**ప్రతులకు:**
**మైత్రీ బుక్స్, 248/సి,**
**ఎల్ఐజీహెచ్,**
**ఎస్.ఆర్. నగర్,**
**హైదరాబాద్ —38.**

---

ముద్దులు పెట్టించుకోవడం చూస్తుంటే, నా వొంటి మీధ తేళ్లు, జెర్రులు పాకినట్లుగా ఉంటుంది. వాడు అల్లరి చేసినా, ముద్దు ముద్దుగా మాట్లాడినా, కన్నవాళ్ల అమ్మే గుర్తుకు వస్తుంది కానీ నేను కాదు కదా! ఒక వేళ రేపు వాడు పెద్దయి. పెద్ద చదువులు చదివి గొప్పవాడైతే, ప్రతి ఒక్కరూ ఏ అమ్మ గన్న బిడ్డో ఇంత గొప్పవాడైనాడు అంటారు గానీ నన్ను కాదు కదా!"

"అలా అనకు దక్షూ! ఇప్పుడూ శ్రీకృష్ణుని ప్రేమతో పెంచిన యశోదను చెప్పుకుంటున్నారు గానీ దేవకిని చెప్పుకుంటున్నారా? అందులో ఈ రోజుల్లో పిల్లలు వంశం నిలబెట్టటానికే గానీ, మన ఆలనా పాలనా చూస్తారనే నమ్మకం ఉందా చెప్పు. ప్లీజ్ ఒప్పుకో దక్షూ!" బతిమాలే ధోరణిలో ప్రాధేయపడుతున్నాడు శివానందం.

ఆ మాటలు విన్న దాక్షాయణి దక్షయజ్ఞంలో అవమానపడిన దాక్షాయణిలా చివ్వున అంతెత్తు లేచింది. "అనవసరమైన పిచ్చి పిచ్చి ఆలోచనలు చేయకండి. అసలు మాతృత్వం అంటే ఏమిటో మీకు తెలుసా? బిడ్డ కోసం తల్లి ప్రాణాలైనా వదిలేస్తుంది. అలాంటిది కిరాయి గర్భాశయాన్ని కొని ఆ బిడ్డని పెంచుకుందామని అంటారా? నేను భారతీయమాతృమూర్తిని. అలాంటి దారుణానికి ఎన్నటికీ ఒప్పుకోను. ఇంట్లో గది అద్దె కిచ్చుకున్నట్లు, ఎంతో పవిత్రమైన గర్భాశయాన్ని అద్దెకిచ్చుకుని దానిపై బ్రతికే ఆడవారికి లేకపోయినా, మనకైనా కాస్త బుద్ధి, జ్ఞానం ఉండాలి కదా! ఇదే ఇలాంటి చండాలమైన, విచిత్రమైన మాట వినడం. సంతానభాగ్యం లేని తల్లిదండ్రులు నూటికి ఒకరో ఇద్దరో ఉంటారు. అలాంటివారికి పిల్లలున్న తల్లిదండ్రులు ఒక పిల్లనో, పిల్లవాణ్నో ఇవ్వొచ్చు, వాళ్లు పెంచుకోనూ వచ్చు. లేకుంటే మీరు చెప్పిన పద్ధతుల ద్వారానైనా బిడ్డని పొందవచ్చు. కానీ అన్నీ బాగుండి మాతృత్వం పొందటానికి మథనపడే ఆడవారు ఆడజాతికే ఒక కళంకమౌతారు. మీకు గట్టిగా చెప్తున్నాను. మీరు ఒప్పుకుంటే సక్రమమైన దారిలో బిడ్డల్ని కని దొడ్డవారి మనిపించుకుందాం. లేకుంటే.. గొడ్రాలిననిపించుకుంటూ ఇలాగే జీవచ్ఛవంలా బ్రతుకుతాను!" నిక్కచ్చిగా, నిర్భయంగా చెప్పింది దాక్షాయణి.

ఆమె నిర్ణయం ముందు తన చర్యలేవీ పని చేయవని తెలుసుకున్న శివానందం, చేసేది లేక ఆమె ఆశకే ప్రాముఖ్యమిద్దామనుకుని, ఆమె చేయి పట్టుకుని తన పక్కనే కూర్చోబెట్టుకుని, "సారీ దక్షూ, సారీ! నాగరికత వెంట గుడ్డిగా పరుగుపెట్టి వెళ్లడం కంటే, అనాదిగా వచ్చే ఆచారాలను ఆచరించడంలోనే అంతు లేని ఆనందం. ఆత్మ గౌరవం వున్నాయని తెలుసుకున్నాను. అమ్మ మనసులో వుండే అమృతం, ప్రతి జీవినీ పదికాలాల పాటు బ్రతికిస్తూ చిరంజీవులను చేస్తుందని నిరూపించావు. ఇప్పుడే డాక్టరు దగ్గరకు వెళ్దాం. నువ్వు తొమ్మిది నెలలూ మోసి బిడ్డని కను. నేను వాడి బరువుబాధ్యతల్ని 90 ఏళ్లు మోస్తాను" అంటూ ఆమెను సముదాయించాడు.

"వద్దు... వద్దు, మీరంత పని చేయద్దు. 19 ఏళ్లు వాడి బరువు మీరు మోయండి చాలు. ఆ తరువాత జీవితాంతం మన బరువుబాధ్యతల్ని తనే మోసే మంచి మనసు గల, మమకారాల బంధం గల కొడుకునే కని మీ చేతిలో పెడతాను. సరేనా?"

తల్లుల్లారా! ప్రకటనలు చూసి మోసపోక మీ పిల్లల్ని మీరే కనండి. స్వచ్ఛమైన ప్రేమను పొందండి!